

# అంటు వ్యాధులు

ధనికొండ హనుమంతరావు

"నువ్వు ఎంతో మంచివాడని మన స్నేహితులందరూ అనుకుంటు న్నారు" అన్నాడు, సత్యనారాయణ.

ఈ మాటల్తో నాముఖం వికసిస్తుం దనివాడు అభిప్రాయపడ్డాడు కాని, ఇలా దిగులుగా చూస్తానని వాడు అనుకొని వుండడు; వాడి ముఖంలోని డిసప్పా యింటుమెంటును చూస్తూనే నే నది గ్రహించగలిగాను.

"నాకు అంతకన్న పరమ శత్రువు—"

"శత్రువా? ఆడదా? మొగాడా?"

"ఆడో మొగో నేను నిర్ధారణంగా చెప్పలేను. మన మంచితనంకన్న ఆగర్భశత్రువు మరి వుండదు."

"అదా విషయం?... ఏం అలా అన్నావ్?"

"వీళ్ళందరికీ నేను మంచివాణ్నెందు కయ్యానో తెలుసా? అడిగిన వాడికల్లా డబ్బు అప్పిచ్చి, నా చేతకానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ తలకుమించిన సహా యాలు చేస్తూ వొచ్చినందుకు—"

"దానికి వాళ్ళు కృతజ్ఞులుగా వుండి- నిన్ను మంచివాడని అంటున్నారేకాని- దుర్మార్గుడని అనటంలేదే; అదీకాక- నువ్వు ఇచ్చిన డబ్బు అప్పుగానే కాని,

ధర్మంగా కాదుగా ! అందుకని నువ్వు ఇచ్చిన డబ్బు ఇక్కడ లంచంగా కూడా చలామణీ అవదు."

"అప్పనేమాట అడ్డమేకాని-నిజానికి అది ధర్మమే !"

"ధర్మమా ! ఎట్లా ?"

"ముందు అప్పుగా ఇమ్మనే అడుగు తారు ...మనం ఇస్తాం. కాని తరువాత అది మన చేతికివొచ్చి ఛస్తేగా ?"

''రాక ఏమౌతుందీ ! ఒకవేళ మరిచి పోయి వుండొచ్చు. నువ్వు కాస్త జ్ఞాపకం చేసి తిరిగి తీసుకుంటే సరి."

"మరిచిపోవటం హాస్యాస్పదం. ఒక వేళ అదే నిజమైతే అలా మరిచిపొయ్యే వాణ్ని 'కృతఘ్నుడు' అని తెలుగులో అనరు, చేసిన మేలును మరిచేవాడు కృత ఘ్నుడు !...అడగటం అంటే మాటలా? స్నేహమనేది వొకటి అడ్డం వుందిగా ! అడుగుతే ఏమన్నా అనుకుంటాడేమో ననే భయం ; అసలు అడిగే స్వభావం కూడా మనకు లేదాయె ! ఏదో విధంగా ఒకటికి రెండుసార్లు అడిగి ఒత్తిడి కలి గించామంటే — ఇంకేముందీ — మనతో మాట్లాడటం మానేస్తారు. ఊళ్లో మనను గూర్చి దుష్ప్రచారంకూడా సాగిస్తా రనేందుకు సందేహంలేదు."

"అది నీలోని బలహీనత...!"

"దాన్నే వాళ్ళందరూ 'మంచితనం' అనే మారుపేరుతో పిలుస్తున్నారు."

రెండు నిమిషాలు ఆలోచనలో పడి "తీసుకున్న పైకం తిరిగి ఇవ్వలేనివాళ్ళు అసలు అప్పుగా తీసుకోవటం దేనికి ?'' అన్నాడు సత్యనారాయణ.

"ధర్మంగా అడుగుతే ఎవరిస్తారూ ! వాకిట్లోకి వొచ్చిన బిచ్చగాడికీ, ధర్మంగా అడిగే స్నేహితుడికీ - దుస్తుల తీరులో తప్ప ఇంకేమీ భేదంలేదు."

"ఇప్పుడు నీకు వెంకటేశ్వర్లు ఎంత ఇవ్వాలి ?"

"వంద''

"వందా ?...కృష్ణమూర్తి ?"

''డెబ్బైయ్- మొత్తం మూడువేలకు తక్కువకాకుండా లిస్టువుంది—"

"మూడు వేలే''

''మరేమనుకున్నావ్ ? మూడు సంవత్సరాలనుంచీ ఇంత ఖర్చుపెడుతూ వీళ్ళందరిచేతా మంచివాణ్ణి అనిపించు కోవటం మాటలా ! ఎవర్ని కాస్త కది లించినా విషయాన్ని తప్పించి మాట్లాడు తారు. వాళ్ళేమో నాకు టోపీ వెయ్య గలిగినట్టూ, నాకన్న గొప్ప తెలివి తేటలు ఉన్నట్టూ చూస్తూ-టలాయించి తిరుగుతారు. ఒక్కోచోట నన్నొక అపరిచిత వ్యక్తినిగా చూస్తారు. నేను గ్రహించగలిగిందేమిటంటే— ఈ విష యంలో ఏ కాస్త ముందుకుపోయినా— రానిడబ్బు రాకపోగా పైపెచ్చు విరో ధాన్నికూడా కొని తెచ్చుకోవాలి—''

"ఇలాగాతై జీవితం ఎలాసాగు తుందీ !"

''అంతకన్న మరిగత్యంతరంలేదు. పోగిననాన్న ళ్ళే—ఏం చేస్తాం ?''

సత్యనారాయణ ముఖం కొత్త ఆలోచనలో వెలిగింది. అన్నాడు ; "ఒక విధంగా ఆలోచిస్తే నువ్వు మంచివాడివనే కీర్తికోసం పాకులాడుతున్నట్లు తోస్తుంది—"

"నేనెప్పుడూ అలాంటి కీర్తికోసం ప్రయత్నించలేదు. దానంతట అది టన్నులకొద్దీ వొచ్చి పడుతూవుంటే—నే నొక్కణ్నే భరించలేక ఛస్తున్నాను. ఆ మంచితనం నాకు చేసిన మేలేమీలేక పోయినా, కీడుచేస్తోంది! అలాంటిదాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానించగలిగే ధైర్యం నాలాటి సామాన్యుడికి ఉండటం—నిజంగా అసహజమే!''

''నీ గొడవ నాకు అంతుపట్టలేదు. శాస్త్ర కఠినంగా ప్రవర్తించకపోతే మిగిలిన మూడు ఎకరాలుకూడా అమ్మెయ్యాల్సి వొస్తుంది. ఇక సంసారం సంగతి వేరేచెప్పనక్కర్లేదు. ఇదంతా నీలోపమేననేందుకు నాకో మంచి కారణంకూడా కనిపిస్తోంది''

''ఏమిటది ?"

"నన్నెవరూ అడగరేం ?" తన తెలివితేటల్ని నేను మెచ్చుకోవాలని కాబోలు నా ముఖంలోకి సూటిగా చూశాడు.

"అడిగినా లేదని నిర్మొహమాటంగా అనేస్తావ్. అసలు నీదగ్గర్నుంచి డబ్బు రాల్తుందనే నమ్మకం ఎదుటివాడికి ఎలా కలుగుతుంది? ఎప్పుడు చూసినా జేబులో చిల్లరతప్ప ఇంకేమీ ఉండదాయె! ఇంకోడు నిన్ను అడిగేముందు—నువ్వే వాణ్ణి అడిగేస్థితిలో ఉన్నావనే అభిప్రాయాన్ని కూడా కలిగించక మానవు—తెలిసిందా ?''

సత్యనారాయణ తెలిసినట్టుగా తల ఆడించి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

"ఇంత మారిపోతావనుకోలేదు ; ఇలాటి దుస్థితికి వొస్తావనుకోలేదు" అన్నాడు పాతస్నేహితుడు సూర్యనారాయణ.

"నన్నుగూర్చిన విచారం నాకేమీ లేదు. ఇక నీకు దేనికి ?"

"స్నేహితుణ్ణి కనుక... నిన్ను గూర్చి నువ్వెప్పుడూ ఆలోచించక పోవటంవల్ల విచారపడాల్సిన విషయం నీకు కనుపించలేదనుకుంటాను."

"పోనీ—ఇప్పు డావిచారాన్ని కొని తెచ్చుకోవటం దేనికి ?"

"కొద్ది రోజుల్లోనే నీకు పిచ్చికూడ ఎక్కేట్టుంది... ఉండేందుకు ఇల్లు లేకుండా అమ్ముకున్నావు. బారెడు గింజలక్కూడా గతిలేకుండా పది ఎకరాలభూమినీ అమ్మి కూర్చున్నావు. తాటివనంకూడా అమ్మావుటే ! ఇంకా విచారపడేందుకు ఇంతకన్న ఇంకేం కావాలీ ?''

"ఇండియా గవర్నమెంటుకు ఏ పన్ను రూపంలోనూ నాదగ్గర్నుంచి దమ్మిడీకూడా పోదు. కాగా, ప్రతి ఇతర పౌరుడికీవున్న హక్కులు నాకూ వున్నాయ్—"

"నీకు ఇంకా యీ బింకం ఉండటం ఆశ్చర్యంగానే వుంది"

"దీన్ని కూడా అమ్మలేదనా నీ ఆశ్చర్యం?"

"ఇంత మొండిగా మారావేం? మొన్న మీ మామగారు కనిపించి నీ స్నేహ బృంద మంతాజేరి నిన్ను సర్వమంగళం చేశారని చెప్తే విని ఎంతో విచార పడ్డాను. భార్యాబిడ్డల గతేంకానూ? ఏదన్నా ఉద్యోగమన్నాచెయ్యి—అంత కన్న ఇంకేంవుందీ?"

"వెధవ ఉద్యోగం!"

"ఐనా నాకు తెలియక అడుగు తాను— నీకు యీ స్నేహితులు ఎందు కంట? ఒక తాగుడులేదు, బాగా అనుభ వించిందీ లేదు; ఐదు సంవత్సరాల్లో ఇంత డబ్బు ఖర్చయిందంటే— దానికి కార కులు నీ స్నేహితులు! ఇప్పటికన్నా వాళ్ళను వొదలవేం?"

"ఎట్లా వొదులుకునేదీ? డబ్బుతో కొనుక్కున్న స్నేహమాయె చూస్తూ చూస్తూ ఎలా విసిరిపారేసేదీ?"

"పోనీ వాళ్ళవల్ల నీకేమన్నా మేలు కలుగుతోందా?"

"ఆఁ, నన్నుకూడా వాళ్ళబృందంలో కలుపుకున్నారుగా!"

"మరి ఇన్నాళ్ళూ?"

"ఇన్నాళ్లూ నేను వాళ్ళదగ్గర ప్రాపకం కోసం వాళ్ళ ఖర్చుల్ని భరించే వ్యక్తిని. ఇప్పుడు వాళ్ళే—"

"వాళ్ళు నీకింద ఏమన్నా ఖర్చు పెడుతున్నారంటావా?"

"వాళ్ళ జేబుల్లోంచి కాకపోతే మాత్ర మేం? మొదట్లో నన్ను వెతికితెచ్చి నట్టే— ఇప్పుడు మేమందరమూ కలిసి ఉన్నవాణ్ని ఇంకోణ్ని పట్టుకొచ్చి-తలకాస్తా పిండుకుంటాం! ఆ పిండుకునే వాళ్ళలో ఇప్పటికి నాక్కూడా వాట స్థానం లభించింది."

"వాడు పిండుకోనీవొద్దూ?"

"అది మన ప్రావీణ్యత - దాన్ని ఎవ్వరూ ఆపలేరు. నే నేం అడ్డగించ గలిగానూ? స్నేహితం ఉండనే ఉందాయె! కొత్తవాడికి యీ స్నేహి తాన్ని వొదిలించుకుందామనే దురుద్దేశం వున్నా-మేము వొదలమాయె!"

"అంటే వాణ్ని నీలాగే సర్వ మంగళం చేసేదాకా—?"

"అంతే!"

"జలగ వ్యవహారంగా వుందే!"

"కాని మేము జలగలాగు కాకుండా-బాధకనిపించకుండా-క్లోరోఫారం కింద చేసే ఆపరేషన్‌లాగు-పీల్చగలం!"

"మత్తు తెలికాకన్నా—?"

"అప్పటికి మిగిలిం దేముంటుందీ? నాలాగే పాపర్! అప్పటికికాని మా జల గల సంఘంలో వాడికి సభ్యత్వం లభిం చదు."

"నువ్వు ఇంతడబ్బూ తగలేసి చివ రకు నేర్చింది యీ కళ్ళ నమాట? ఈ సంగతి వింటే నిన్ను ఎవరైనా జేర నిస్తాడూ? ఇలా గోముఖ వ్యాఘ్రంగా..."

"నా సంగతి ఊళ్ళో విచారించు—ఏ మంటారో?"

"అదే నాకు ఆశ్చర్యంగా వుంది. ఇంత దుర్మార్గుణ్ణి 'మంచివాడు' అని లోకులు ఎలా అనగలుగుతున్నారంట?"

"మరి నేను పెట్టిన లంచం! ఇన్నాళ్ళూ నేను వాళ్ళకింద ఖర్చు పెట్టిన డబ్బు! నీకు మంచితనం పర్వ తాల పరిమాణంలో కావాలంటే—"

"నాకు వొద్దుబాబూ!"

"ఏం భయంలేదు... ఇదీ వొకరకం వ్యాపారమే అనుకో. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ల లాటిదీ... ఉత్త్రోత్త్రా క్రమంగా అంతకు రెండింతలు రిటరన్ వొస్తుంది... తెలిసిందా?"

"నాకు అంతా అయోమయంగానే వుంది? ఐనా ఇలా స్నేహితుల ధర్మాల మీద ఎన్నాళ్ళు బతుకుతావూ?"

"ధర్మమేమిటీ - నీమొహం? అప్పు! మన జీవితం పట్టాల్ని అంటిపెట్టుకొని పరుగెత్తే రైలులాగు ఒడిదుడుకులు లేకుండా సాగిపొయ్యే అయోమార్గం!"

"ఇక్కడ నీ స్నేహితులేగా పట్టాలు కాని-రైలుపట్టాలు జరగవు, వీళ్ళు జరు గుతూ వుంటారు కనుక, నువ్వన్న రైలు ఎప్పుడో అప్పుడు తలక్రిందు లుగా పడక మానదు."

"ఆ పట్టాపోతే-ఇంకో కొత్త పట్టా తెచ్చి వేస్తాం—"

"పోనీ స్నేహితులదగ్గర చేసే అప్పు మాత్రం ఏట్లా తీర్చగలవూ?"

"తీర్చటం దేనికి? నేను ఇప్పటికి అప్పుగా ఇచ్చిన పైకమంతా వొస్తే పోగొట్టుకున్న ఆస్థినంతా తిరిగి కొన గలను!"

"అప్పు తీర్చకపోతే ఊరుకుం టారా?"

"నేనేం చెయ్యగలిగానూ? అందరూ అంతే! స్నేహంలో తీసుకున్న అప్పును తిరిగి అడిగి స్నేహాన్ని పోగొట్టు కుంటారా యేం!"

ఇట్లా ఎన్నిసార్లూ?"

"ఒక్కో స్నేహితుడి తాహతునుపట్టి ఒక్కోసారే చాలు. కొత్త సభ్యులు వొస్తూనే వుంటారుగా!"

"ఇలాగే ప్రతివాడితోనూ వాగుతూ వుండు. నీ స్నేహాన్ని ముందుగానే అర్థంచేసుకొని నీ పీపు చెడగొట్టిపోతాడు- తెలిసిందా?"

"మరేం ప్రమాదంలేదు. ఒకసారి సత్యనారాయణకు ఇదంతా చెప్పాను—"

"ఏ సత్యనారాయణా?"




"ఆ పుస్తకాల షాపులో వుండడూ-"

"ఆఁ. పొద్దున నిన్నుగూర్చి గంట సేపు కీర్తించాడు..."

"వాడుకూడా మన కాతాదారు డేలే:... అంతావిని నాతో విరోధం పెట్టుకుంటాడేమో ననుకున్నాను. కాని ఆనాటినుంచీ మరీ అంటిపెట్టుకొని తిరగటం మొదలు పెట్టాడు నెలతిరిగేప్పటికి రెండువందలూ అప్పుతీసుకున్నాడు—"

"తీసుకొని ఇచ్చాడా?"

"ఈ దేశంలోనూ, ప్రత్యేకించి మా సంఘంలోనూ అలాటి ఆచారమే లేదన్నాగా! ఆనాటినుంచి వాడికి నేనెంతో మంచివాణ్ని!"

"నీమాటలు వింటూంటే నాకు పిచ్చెక్కేట్లు వుంది...పన్నెండయింది...యీ ఒంటిగంట బండికే వెళ్తాను—"

"వెళ్తే వెళ్ళావ్ కాని-నీదగ్గర వొక యాభై రూపాయలుంటే ఇచ్చి వెళ్ళు-వెలాఖరుకు పంపుతాను."

సూర్యనారాయణ బిత్తరపోయి చూసి, పెదవులరాకా వొచ్చిన మాటల్ని బలవంతాన బైటపడనీకుండా లోలోపలే గొణుక్కున్నాడు.

"మరేం భయం లేదు లేవోయ్. కావాలంటే నీకు నోటురాస్తాను—"

వాడు జవాబు చెప్పలేక, మాట్లాడకుండా యాభై రూపాయలూ ఇచ్చి, రిక్షా ఎక్కి "త్వరగా—స్టేషన్‌కు" అని తన వెనుక ఏదో వన్యమృగం ఉన్నట్లు, తిరిగన్నా చూడకుండానే సాగిపోయ్యాడు.

నేను ఇంతకుముందే అప్పుగా సంపాయించిన పైకాన్ని జేబులో పెట్టుకొని, స్నేహబృందంలోని సభ్యులు ఎక్కడ ఎదురౌతారో ననే భయంతో - సందుగొందుల్లోనుంచి ఇంటిదారి పట్టాను.